# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

# THE WORD OF TRUTH



JUNE 1995

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రసుకు M.O. చేసినచో రూ. **100-00** లకు మించిన విలువగల **15** నుండి **20** రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1. | కీర్తన పుస్తకం | రూ. 14-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాస పత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : మీరు పంపు పైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**

Sambamurthi St., Ramaraopeta,

KAKINADA - 533 004.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone ; 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 జూన్ 1995 సంచిక 11

## సంపాదకీయం

### సంఘముయొక్క స్వయం ప్రతిపత్తి

### (The Auton my of the Church)

ఏదైనా ఒక సంస్థ, లేక ఆర్గనైజేషన్, లేదా ఒక రాజ్యము స్వతంత్రత కలిగి, బాహ్య ఒత్తిడులు యేమీ లేకుండా స్వయం పాలన కలిగియుంటే అది స్వయం ప్రతిపత్తిని (Autonomy) కలిగి యున్నదని చెప్పవచ్చును. ప్రపంచములో ఆయా ప్రాంతములు స్వయం ప్రతిపత్తి కలిగినవిగా ప్రకటింపబడుట మనం తరుచు వింటాము. అంటే వారి వ్యవహారాలను వారు చక్కబెట్టుకొను అధికారం వారికీయబడిందన్న మాట.

మత ప్రపంచములో అన్ని డినామినేషన్లు ఈలోక సంబంధమైన ఆర్గనైజేషన్‌ను కలిగి, ఎవరో ఒకనిని తమ నాయకుని (Head) గాను, ఏదో ఒక పట్టణాన్ని తమ కేంద్రస్థానము (Head Quarter)

గాను భావిస్తు యుంటారు. ఈ కేంద్రస్థానం నుండి వెలువడే నియమాలకు ఆ డినామినేషన్‌లోని సంఘము లన్నియు కట్టుబడి యుంటాయి. అయితే ఈ నియమాలు లేఖన విరుద్ధమైన యెడల, ఆ సంఘము లన్నియు బైబిలు బోధకు వేరైనదానికి లోబడుచున్నవని యర్థము. అయితే దేవుని వాక్యమును బట్టి ఈ రకమైన ఆర్గనైజేషన్ తప్పు అని మనకు తెలుసు. పలు రకములైన సంఘములు, పలు కేంద్ర స్థానములు, పలు శిరస్సులను (నాయకులను) గూర్చి బైబిలులో ఎక్కడా కనబడదు. క్రీస్తు ఏకైక సంఘాన్ని స్థాపించెను. దానికి ఆయన ఒక్కడే శిరస్సు. ఆయన సంఘానికి భూసంబంధమైన కేంద్రస్థానము యేదీలేదు.

క్రీస్తు సంఘము ఈ లోకములో యున్నది, నిజమే. నిజానికి అది ప్రపంచములోని అన్ని దేశాల్లోను నేడున్నది. దానికి భూసంబంధమైన శిరస్సు ఎవడు లేడు. తత్ఫలితముగా భూసంబంధమైన కేంద్ర స్థానం యేదీలేదు. అయితే క్రీస్తు సంఘములో వేవేల స్థానిక సంఘములున్నాయి. అవన్నీ క్రీస్తును మాత్రమే తమ శిరస్సుగా భావిస్తాయి. అవన్నీ క్రొత్త నిబంధనను బట్టి మాత్రమే నడిపింపబడ్తాయి ప్రతి స్థానిక సంఘము అర్హతగల వ్యక్తులున్నప్పుడు పెద్దలను పరిచారకులను కలిగి క్రొత్తనిబంధనను బట్టి నడిపింపబడ్తాది (1 తిమోతి 3; తీతు 1 అధ్యా). ప్రతి స్థానిక సంఘములోను బోధకులు, వాక్యోపదేశకులు ఉంటారు. స్థానిక సంఘాల్లో పెద్దలు పరిచారకులు అర్హతలు గలవారు లేనియెడల అట్టివారు నియమింపబడేవరకు సంఘ కార్యక్రమములను అందలి పురుషులే చక్కబెట్టుదురు. ఇంకొక మాటలో ప్రతి స్థానిక సంఘము క్రీస్తు నందు స్వయం ప్రతిపత్తి కలిగి, స్వయం పాలన, స్వయం పోషకమైనదై, స్వతంత్రత కలిగియుండును. తన పనిని అది నిర్వహించును.

సంఘ పాలన పద్ధతిలో స్థానిక సంఘములో ఒకడు పెద్దలలో

ఒకనిగా నియమింపబడితే అది దొడ్డయైన పని. ఒక స్థానిక సంఘములో ఇద్దరుగాని అంతకు ఎక్కువగాని అర్హతగల వారున్నప్పుడు మాత్రమే వారు పెద్దలుగా నియమింపబడవలెను. అట్టివారు ఆ స్థానిక సంఘములో మాత్రమే పెద్దలుగా, నాయకులుగా కాపరులుగా వ్యవహరింతురు. స్థానిక సంఘములో ఒకే ఒక వ్యక్తి పెద్దగా నియమింపబడుట గాని, లేక ఉన్న పెద్దలందరిలో ఒకడు 'ముఖ్య పెద్దగా' వ్యవహరించుటగాని లేఖనములలో కనీవినీ యెరుగనిది. అట్లే ఒకే పెద్దగాని లేక పెద్దలుగాని అనేక సంఘములపై నాయకత్వం వహించుట లేఖన విరుద్ధమైనది. అట్లే పెద్దలయొక్క బాధ్యతలను, అధికారమును ఒక బోధకుడు చెలాయించుట లేఖన విరుద్ధమైనది.

ప్రతి స్థానిక సంఘము స్వయం ప్రతిపత్తి కలిగినదే అయినను రెండుగాని అంతకు ఎక్కువగాని సంఘములు కలసి సహవాసము కలిగియుండరాదనిగాని, సహకరించుకోరాదనిగాని దాని యర్థము కాదు. సువార్త ప్రకటించు నిమిత్తమును, యితర సత్క్రియలు చేయు నిమిత్తమును ఒక స్థానిక సంఘము మరొక స్థానిక సంఘానికి ఆర్థిక సహాయం అందజేయవచ్చును. అట్టి సందర్భములలో కూడ ప్రతి స్థానిక సంఘము దాని నిర్ణయముల నదే గైకొనుచు స్వయం ప్రతిపత్తి కలిగినదే అయ్యుండును. అయితే ఒకే స్థానిక సంఘము మరొక సంఘాన్ని ఆర్థిక సహాయం విషయంలో బలవంతము చేయరాదు, చేయదు.

భారతదేశంలో యున్న పెక్కు స్థానిక క్రీస్తు సంఘముల సమస్య యేమంటే, అవి విదేశీ సహాయముపై కేవలము ఆధారపడి పనిచేయుచు ఒకరితో ఒకరు సహవాసములేక యున్నారు. వారు ఒకే ప్రాంతములో ఉన్నను ఒకరి సువార్త కూటములకు మరొకరు హాజరుకాకుండా, ఒకరితో ఒకరు సహకరించకుండా మనుగడ కలిగి

యున్నారు. దీనికి చాలమట్టుకు విదేశీ దొరలు, ఇక్కడ వారి అను చరులే కారణం. విచారకారణం యేమంటే ఆయా విదేశీ సపోర్టును బట్టి క్రీస్తు సంఘములో గుంపుతత్వం ఏర్పడి యున్నది. యిది చాల తప్పు, చెడుగు. మనము అపవాదిని వాని తంత్రములను ఎదుర్కొను నిమిత్తము కలిసి పనిచేయాలి, ఒకరినొకరు ప్రోత్సహించాలి. స్థానిక సంఘములు స్వయం ప్రతిపత్తిని కలిగియుంటూ ఒకరికొకరు సహాకరిస్తే మనకు కావలసినంత బలము చేకూరును.

చివరిగా ప్రతి స్థానిక సంఘము క్రీస్తునందు స్వయం ప్రతిపత్తిని కలిగియుండుటలో, ఒకవేళ ఒక స్థానిక సంఘము సత్యము నుండి తొలగి మతశాఖల తత్వము ననుసరిస్తు విశ్వాస భ్రష్టత్వములో పడిపోతే, దాని చుట్టూయున్న స్థానిక సంఘములు సత్యములో నమ్మకముగా నిలబడగలుగుటకు అవకాశమున్నది. అట్లు గాక ఈ స్థానిక సంఘము లన్నియు ఒక భౌతిక నాయకునికి కట్టుబడి యుంటే, అతడు విశ్వాస భ్రష్టుడైతే ఈ సంఘము లన్నియు భ్రష్టత్వము పాలగును. అయితే సంఘపాలని పద్ధతి స్థానిక మవుటవలన దేవుని నిర్మాణ పద్ధతి అతి శ్రేష్టమైనది.

గనుక ప్రతి స్థానిక సంఘము క్రీస్తునందు స్వతంత్రత కలిగి స్వయం ప్రతిపత్తిని కలిగియుండుట అంటే యేమిటో గ్రహించు కొందము. మనం లేఖనముల ననుసరించునప్పుడు ప్రతి స్థానిక సంఘము పరిపూర్ణ మగును; యితరులు యేమి చేసినా, యేమి బోధించినా అది క్రీసుకు నమ్మకముగా యుండగల్గును స్వయం ప్రతిపత్తిని కల్గియున్నను మనందరం యేకమై, క్రీస్తుయొక్క ఒకేఒక్క సంఘమై ఒకరితో నొకరు సహవాసము కలిగి, ఒకరికొకరు సహకరించుకొనుచు, ఒకరినొకరు ప్రోత్సహించుకొనుచు ఆయన మహిమకొరకు ఆయన పొలములో పనిచేయుదము. మనం ఒకరినొకరు కరచుకొనక, ద్వేషిం

చక, నాశనం చేయ యత్నించక, క్రీస్తునందలి స్వాతంత్ర్యమును ఆయన శరీర క్షేమాభివృద్ధి కొరకు వినియోగించుదము !!

—o—

కొండమీద ప్రసంగము-14

## పొరుగువానితో సమాధానపడుట

## (Reconciliation with your Fellowman)

(మత్తయి 5 : 23-26)

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో తన సహోదరుని ద్వేషించువాడు, లేక దూషించువాడు నరహంతకునివలె నరకాగ్నికి పాలవుతాడు అని హెచ్చరించిన తరువాత ఒకడు దేవుని ఆరాధించాలంటే, ఒకని ఆరాధనను దేవుడు అంగీకరించాలంటే అతడు ముందు దేవునితోను, తన తోడి సహోదరునితోను సమాధానపడాలని ఆయన బోధించారు. "నీవు బలిపీఠము నొద్ద అర్పణము నర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి విరోధ మేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల, అక్కడ బలిపీఠము యెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి మొదట వెళ్ళి నీ సహోదరునితో సమాధానపడుము. అటు తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము. నీ ప్రతివాదితో నీవును త్రోవలో ఉండగానే త్వరగా వానితో సమాధానపడుము; లేనియెడల ఒకవేళ నీ ప్రతివాది నిన్ను న్యాయాధిపతికి అప్పగించును. న్యాయాధిపతి నిన్ను బంట్రోతుకు అప్పగించును, అంతట నీవు చెరసాలలో వేయబడెదవు. కడపటి కాసు చెల్లించువరకు నీవు వెలుపలికి రానేరవని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని ఆయన బోధించెను (మత్తయి 5 : 23-26).

## సహోదర ప్రేమ

దేవునితో సమాధానము కలిగియుండాలంటే నీ సహోదరులతో

నీవు సమాధానము కలిగియుండుట అవసరం అనే సూత్రాన్ని ప్రభువు ఇక్కడ బోధించారు. దేవుని ప్రేమించాలంటే మనం మన సహోదరులను ప్రేమించాలి. "ఎవడైనను నేను దేవుని ప్రేమించు చున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు" అని భక్తుడైన యోహాను వ్రాసాడు (1 యోహాను 4:20). మానవుడు దేవుని స్వరూపమందు చేయబడ్డాడు. దేవుని స్వరూపములో యున్న మానవుని ద్వేషిస్తే దేవుని ద్వేషించుచున్నట్లే యగును.

## స్వ ప రీ క్ష

తరువాత, యేసుప్రభువు చెప్పిన మాటలలో ఆరాధనకు వెళ్ళక ముందు మనకు మనమే పరీక్షించుకోవాలి అని తేటబడుచున్నది. ఆరాధించుచుండగా దేవుని ఔన్నత్యాన్ని, మన హీనదశను గుర్తుకు తెచ్చుకోవాలి. "కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెనని" అపో. పౌలు చెప్పాడు (1 కొరింథీ 11:28). మీరు విశ్వాస మందున్నారో లేదో మీకు మీరే పరీక్షించుకొనుడి యని అతడు మరొకచోట చెప్పాడు. మనం ఎల్లప్పుడు ఇతరులనే పరీక్షిస్తాము గాని మనకు మనమే పరీక్షించుకొనము. దేవాలయానికి వెళ్లిన పరిసయ్యుడు తన్ను తాను పరీక్షించుకొనడం మానివేసి తన్ను తాను హెచ్చించు కొన్నాడు. అయితే సుంకరి దూరమున నిలుచుండి, ఆకాశమునకైనను కన్నులెత్తుటకు ధైర్యము చాలక ప్రభువా పాపినైన నన్ను కరుణింపుము అని ప్రార్థించెను. అతడు దేవుని ఆరాధించుటకు ముందు తన్ను తాను పరీక్షించుకొన్నాడు. బైబిలు మన ఆత్మకు అద్దమువంటిది. దానిలో మనలను మనమే చూచుకొని తప్పులను సరిదిద్దుకోవాలి.

"కాపున నీవు బలిపీఠము నొద్ద అర్పణ అర్పించుచుండగా"

అని ప్రభువు చెప్పారు. ఇది యూదులు జంతుబలులు అర్పించే కాలమున చెప్పబడినది. అయినను అది వారి ఆరాధనను గూర్చి చెప్పబడిన సంగతియే కావున నీవు క్రీస్తు సంఘములో ఆరాధన చేయుచుండగా అని మనం ఇప్పుడు చెప్పుకో వచ్చును. పాపమువలన దేవునితో మానవుడు సత్సంబంధమును కోల్పోయాడు. అతడు అర్పించు అర్పణనుబట్టి దేవునితో అతని సంబంధము సరిచేయబడును. యేసుప్రభువు బాహ్య క్రియను గూర్చి గాక అంతరంగిక స్వభావమును క్రమబద్ధము చేయాలని చెప్పుచున్నారు. పరిసయ్యులు, శాస్త్రులు నీ హృదయ తలంపులు ఎట్లున్నను ధర్మశాస్త్ర ప్రకారము చేయవలసినవి చేస్తే చాలని తలంచేవారు. అట్లు బోధించేవారు.

నీ సహోదరునికి విరోధమేమైనను కలదని జ్ఞాపకము వచ్చిన యెడల మొదట వెళ్ళి నీ సహోదరునితో సమాధానపడుము; అటు తరువాత వచ్చి నీ యర్పణము అర్పింపుము అని ఆయన చెప్పారు. హృదయంలో ద్వేషం తలెత్తగానే దానిని త్రోసివుచ్చి ప్రేమతో దాన్ని నింపాలి. సూర్యుడు అస్తమించు వరకు మన హృదయంలో కోపం ఉండకూడదు. మన జీవితంలో యున్న తప్పులను ఎల్ల వేళలా సరిజేసుకొంటూ యుండాలి. ఇంకో మాటలో, మనం ఎవరికైనా అప్పు వున్నా, దానిని సరిజేసుకోవలసిన సమయం యిదే. యూదుడైన వాడు బలిపీఠము నొద్దకు బలిపశువును తెచ్చునప్పుడు దేవుడతని హృదయశుద్ధిని కోరుచున్నట్లయితే, యేసుక్రీస్తును వెంబడించువానికి ఇంకెంత శుద్ధహృదయం కావాలి? గనుక మనం ఆరాధన చేయక ముందు మన సహోదరునియెడల మనకేమైనా లావాదేవీలు వున్నా, భిన్నాభిప్రాయాలు వున్నా వాటిని సరిజేసుకోవాలని యేసుప్రభువు బోధించారు. ఆరాధనలో మన ఆత్మలు దేవునియెదుట బహిర్గతం చేయబడ్డాయి. ఆయన హృదయాన్ని పరిశోధించే దేవుడు.

## అర్పణ కంటె సమాధానం అవసరం

దేవునికి అర్పణలు అర్పించుటకన్నా సహోదరునితో సమాధానపడుట అవసరమని యేసుప్రభువు ఇక్కడ బోధించారు. "అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము; అటు తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము" అని ఆయనచెప్పారు. అర్పణము అర్పించుట అవసరమే, దాన్ని యేసు ప్రభువు కాదనుట లేదు. దాన్ని అర్పించుటకు ముందు నీ హృదయాన్ని దైవారాధనకొరకు సిద్ధపరచవలసినదని ఆయన కోరుచున్నారు. ప్రేమతో నిండియున్న క్రీస్తు మార్గములో ద్వేషపూరిత హృదయాలు పనికిరావు. నీ సహోదరునితో సమాధానపడిన తరువాత వచ్చి నీ యర్పణము అర్పింపుము అని ఆయన చెప్పెను. అంటే నీ తప్పును ఒప్పుగా చేసిన తరువాత అర్పింపుము అని ఆయన చెప్పుచున్నారు. ఇంకొకమాటలో నీవు పెట్టిన కష్టమేమిటో తీర్చేసేయి. నీవు కలిగించిన హానిని ఒప్పుకో, సంతృప్తికరంగా దానిని సరిజేసుకో, నీవు నీ సహోదరునియెడల తప్పుచేస్తే దానికి క్షమాపణనడుగు. తీర్చవలసిన అప్పు ఉంటే తీర్చేసేయి. అతని పేరు పాడుచేసిన యెడల దానిని ఒప్పుకో, క్షమాపణ నడుగు. అతడు నిన్ను తప్పుగా భావించిన యెడల దానికి వివరణ ఇయ్యి. అర్థమయ్యేలాగున అతనికి చెప్పు, సమస్య పరిష్కారం కావడానికి నీకు చేతనైనంత మట్టుకు పనిచెయ్యి, శక్తివంచన లేకుండా ప్రయత్నించు.

ఇరుపక్షాలకు ఆమోద యోగ్యంగా కొన్ని సమస్యలను పరిష్కారం చేయలేము. నిజమే! అయితే దాని విషయమై మనం తప్పక కృషి చేయాలి. అందుకే "శక్యమైతే మీ చేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి" యని అపొ. పౌలు చెప్పాడు (రోమా 12:18). ఇక్కడ మనం గుర్తుంచుకోవలసినదేమంటే

మనం చేసిన తప్పును బట్టి మన ఆరాధన దేవునికి అంగీకారయోగ్య మైనది కాకపోవచ్చును. అయితే పొరుగువాడు మనకు చేసిన తప్పును బట్టి మన ఆరాధన వ్యర్థముకాదు. మనం ఒక సహోదరునిమీద తీవ్రింగా కోపగించుకోవడంతో ఆరాధనలో అతడు కూడ యుంటే, సరిగ ఆరాధించలేక పోవుచున్న యెడల, అతడు లేకపోయినను మన ఆరాధన సరియైనది కానేరదు. ఈ సూత్రాన్ని మనం గమనించితే క్రైస్తవ సంబంధాలు మరింత మెరుగు పడతాయి.

## ఆరాధన వ్యక్తిగతం

మనం ఆరాధన చేయుచున్నప్పుడు సరియైన మనస్థత్వం కలిగి యుండాలి. మనం చేయు ఆరాధన అంతా వ్యక్తిగతమైనదే. సమాజ ముగా కూడి యున్నప్పుడు అందరితోను కలసి మనం పాటలు పాడినా, మన వ్యక్తిగత ఆరాధనను దేవుడు అంగీకరించుటయో, తిరస్కరించు టయో జరుగును. ఆరాధన అంతాకూడ దేవునికే చెందును. ఏలయ నగా ఆయన పూజ్యనీయుడు, ఆరాధనామూర్తి. మనం ఆత్మతో ఆయనను ఆరాధించాలి - అంటే సరియైన మనస్తత్వం, సరియైన హృదయం కలిగి, మన మనస్సు ఆరాధనలో లగ్నంచేసి ఆరాధిం చాలి. చేయునదంతయు అర్థం చేసుకొని ఆరాధించాలి. ఆలాగే మన ఆరాధన కూడ సత్యముతో యుండాలి అంటే సత్యవాక్యమును బట్టి యుండాలి. మానవకల్పిత పద్ధతులతో కూడిన ఆరాధన వ్యర్థము (మత్తయి 15:9). దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధనకు సిద్ధపాటు కావాలి. మనం ఏ మంచిపని చేయాలనుకున్నా దానికొరకు సిద్ధపడ తాము. ఆరాధనకూడ ఆలాగే. ఈ విశ్వసృష్టికర్తయొక్క సాన్నిధ్యం లోకి వచ్చునప్పుడు మనం తగిన రీతిగా మన హృదయాలను, మన స్సును, జీవితాన్ని సిద్ధపర్చుకోవాలి. శనివారం అర్ధరాత్రి వరకు T.V. చూచుకొంటూ ఆదివారం ఉదయం నిద్రకళ్ళతో ఆరాధనకు

వెళ్ళుట సిద్ధపాటును సూచించదు. అనేకులు ఆరాధనకు వెళ్ళి అక్కడ నిద్రపోతారు. అదికూడ మంచిదికాదు.

ఆరాధనలో మనం హృదయపూర్వకంగా పాల్గొనాలి, ఆరాధన సమయంలో మన మనస్సులోనికి యితర సంగతులను రానీయకూడదు. మన మనస్సులను ఇటు అటు పోనీయకూడదు. ఆరాధనలో మనం చేయు ప్రతి క్రియను నిష్కపటమైన హృదయంతో, భక్తి భావాలతో చేయాలి.

ఆరాధనలో దేవుని సన్నిధిని మనం పొందుతాము. పాపము దేవునినుండి మానవుని వేరుచేసింది, చేస్తాది (యెషయా 59:1-2). ఆదాము హవ్వలను దేవుడు ఏదెనువనము నుండి త్రోసివేసిన నాటి నుండి యిది సత్యం. మనం పాపమునుగూర్చి మారుమనస్సు పొందని యెడల, దేవుడు మన ప్రార్థనల నాలకించడు, వాటికి జవాబీయడు. "మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు". "నా హృదయములో నేను పాపము లక్ష్యముచేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును" అని భక్తుడైన దావీదు వ్రాసాడు (కీర్తన 66 : 18). "కాబట్టి యీ నీ చెడుతనము మానుకొని, మారుమనస్సు నొంది ప్రభువును వేడుకొనుము; ఒకవేళ నీ హృదయాలోచన క్షమింపబడవచ్చును" అని అపొ. పేతురు గారడీవాడైన సీమోనుకు సలహానిచ్చాడు.

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో ఆరాధనలో మనం సరియైన మనస్తత్వం కలిగి యుండాలని బోధించారు. మోషే ధర్మశాస్త్రముకంటే ఆయన యిచ్చిన క్రొత్తనిబంధన యొక్క శ్రేష్టతను ఆయన ఎత్తి చూపించారు. ఈ క్రొత్తనిబంధన రాతి పలకపై గాక హృదయాలపై వ్రాయబడెనని అపొ. పౌలు చెప్పాడు.

క్రీస్తు ధర్మ శాస్త్రము మన హృదయాలను అదుపులో యుంచుతాది. మన జీవితాలను అదుపులో ఉంచుతాది. హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు. దేవుని ఆరాధించాలంటే నీకు శుద్ధహృదయం అవుసరం. అది దేవునితోను, పొరుగువానితోను కూడ సమాధానపడిన హృదయమై యుండాలి. నీ హృదయం ఎట్టిది ?

— జాషువా గూటం.

— o —

## అర్థరహితమైన ప్రశ్నలు

## ( Meaningless Questions )

నీవు ఎలా రక్షింపబడ్డావు ? ఏ వాక్యముతో దేవుడు నిన్ను రక్షించాడు? నీ పాప మేమిటి ? అని కొన్ని మతశాఖలవారు తరచుగా అడుగుచుంటారు. అలాంటివారికి సమాధానం చెప్పుటకు కొందరు ఇబ్బంది పడుతారు. క్రైస్తవుడు అట్టి అర్థరహితమైన ప్రశ్నలకు సమాధానం చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి.

నీవు ఎలా రక్షింపబడ్డావు ? ఈ ప్రశ్న అడిగే వ్యక్తికి రక్షణ అనగా ఏమిటో, దేవుని ఆజ్ఞలు ఏమిటో, దేవుడు ఎలా రక్షిస్తాడో తెలియదు. ఇది అర్థరహితమైన ప్రశ్న. పెంతెకోస్తు పండుగ దినమున పేతురు ప్రసంగం విన్న తరువాత ఇంచుమించు మూడు వేల మంది ఎలా రక్షింపబడినారో (అపొ. కా. 2 : 38-41) అలాగే నేడు కూడా ఒకడు రక్షింపబడతాడు. ఐతియోపీయుడైన నపుంసకుడు ఎలా రక్షింపబడినాడో (అపొ.కా. 8:26-38), చెరసాల నాయకుడు, అతని యింటివారందరు ఎలా రక్షింపబడిరో (అపొ.కా. 16 : 19-34) నేడు అందరు అలాగే రక్షింపబడుదురు. దేవుని ఆజ్ఞకు (మార్కు 16:16) విధేయుడగుట వలన, ఒకడు రక్షింపబడును. అపొస్తలుల బోధకు (అపొ.కా. 2:38) లోబడుట వలన ఒకడు రక్షింపబడును. కాని ఏదో

ఒక (ప్రత్యేకవిధంగా అనగా దైవ దర్శనంవల్లగాని, కొన్ని స్వప్నముల వలనగాని రక్షింపబడుదురు అని అనుకోవడం అర్థరహితం అమాయకత్వం.

ఒకడు రక్షింపబడవలెనంటె, సువార్త వినాలి (యోహాను 6:45, రోమా 10:17), విశ్వసించి (హెబ్రీ 11:6; యోహాను 20:30) మారుమనస్సు పొంది (అపొ. కా. 17:30) యేసు ప్రభువని నోటితో ఒప్పుకొని (రోమా 10 : 9, లూకా 12 : 8,9) బాప్తిస్మము పొందుట వలన రక్షింపబడును (మార్కు 16 : 16, అపొ.కా. 2 : 38). ఇది యేసుక్రీస్తు బోధించిన మార్గం. అపొస్తలులు అవలంబించి ధృవపర్చిన విధానం. దీనిని మించినది దుష్టుని మార్గం.

నీ సాక్ష్యమేమిటి అనునది అర్థరహితమైన ప్రశ్న. సాక్ష్యము అనగా ఏమిటో తెలియకుండానే చాలామంది తమ అనుభవాలను చెప్పుచుందురు. సాక్ష్యము (witness) అనగా చూచిన దానిని తెలుపుట అని అర్థం. పేతురు కడమ అపొస్తలులు యేసు పునరుత్థానమును గూర్చి సాక్ష్యమిచ్చారు. ఎందుకనగా వారు ఆయన సిలువ వేయబడినప్పుడు సమాధి చేయబడినప్పుడు ఆయన లేచిన తరువాత ఆయనను కన్నులారా చూచారు. యేసుక్రీస్తు ఆరోహణమైనప్పుడు వారు చూచారు. అందుకే యేసే ప్రభువని సాక్ష్యమిచ్చారు (అపొ. కా. 2 : 31, 3 : 15).

యేసును అప్పగించిన యూదా చనిపోయాడు. అపొస్తలత్వము లోను, వారి పరిచర్యలోను పాలుపొందుటకు యూదా స్థానమును మరొకనికి ఇవ్వవలసి వస్తుంది. అతడు యేసుక్రీస్తు పునరుత్థానమును గూర్చి సాక్షిగా ఉండాలి. అందుకు పేతురు . "యోహాను బాప్తిస్మము మొదలుకొని ప్రభువైన యేసు మనయొద్దనుండి పరమునకు

చేర్చుకొనబడిన దినము వరకు, ఆయన మన మధ్య సంచరించుచుండిన కాలమంతయు మనతో కలసియున్న వీరిలో ఒకడు మనతోకూడా ఆయన పునరుత్థానమునుగూర్చి సాక్షియైయుండుట అవశ్యకమని చెప్పెను" (అపొ. కా. 1:20-22). వారు ప్రార్థన చేసి చీట్లు వేయగా మత్తీయ పేరిట చీటి వచ్చెను గనుక అతడు పదునొకండు మంది అపొస్తలులతో కూడా లెక్కింపబడెను.

యేసుక్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చుట కొరకు ఆయన చేసిన కార్యములు కన్నులారా చూచిన వ్యక్తిని ఎన్నుకున్నారు. సాక్ష్యము కొరకు అలాంటివారు కావాలి. వారే సాక్ష్యమివ్వగలుగుతారు. వారి సాక్ష్యము సత్యము. అపొస్తలుడైన యోహాను ".. ఆదినుండి ఏది యుండెనో, మేమేది వింటిమో, కన్నులార ఏది చూచితిమో, ఏది నిదానించి కనుగొంటిమో, మా చేతులు దేనిని తాకి చూచెనో, అది మీకు తెలియజేయుచున్నాము" (1 యోహాను 1:1) అని వ్రాసాడు.

నేడు ఒకడు ఏమి సాక్ష్యమియ్యగలడు? అతడు యేసుక్రీస్తును గాని, ఆయన చేసిన కార్యములను గాని చూచాడా? అతడు ఆయన మరణముగాని పునరుత్థానముగాని చూచాడా? నీ సాక్ష్య మేమిటి అని ప్రశ్నించడంలో అర్థమేమిటి? కొందరు నా సాక్ష్యం వినండి అంటూ తమ అనుభవాన్ని చెబుతారు. ఇది కేవలం చారిత్రకం గర్వాంధం.

అపొస్తలుడైన పౌలు యేసుప్రభువును చూచాడు. ఆయన స్వరం చెవులారా విన్నాడు. కనుక ఆతనితో మాట్లాడిన యేసును గూర్చి సాక్ష్యమిచ్చాడు. అతని గూర్చి యేసు "...నా నామము ధరించుటకు అతడు నేను ఏర్పరచు కొనిన సాధనమై యున్నాడు" అని అన్నారు (అపొ. కా. 9:15). తన అపొస్తలత్వమును గూర్చి

పౌలు ఇట్లుచెప్పెను: 'నేను ఏమాత్రపువాడను కాకపోయినను మిక్కిలి శ్రేష్ఠులైన యీ అపొస్తలులకంటె నేను ఏ విషయములోను తక్కువ వాడనుకాను" (2 కొరింథీ 12:11). అపొస్తలుడైన పౌలు ఆ రోజుల్లో సాక్ష్యమిచ్చినట్లు నేడు ప్రతి క్రైస్తవుడు కూడా సాక్ష్యమివ్వాలని అనుకోవడం, ప్రశ్నించడం అర్థరహితం, అమాయకత్వం. పౌలు నేను అపొస్తలు లందరికంటె కడపటి వాడను (1 కొరింథీ 15 : 8, 9) అని అన్నాడు. అతని తరువాత ఎవరైనా అపొస్తలులు ఉన్నట్లు బైబిలు గ్రంథము చెప్పుటలేదు. పౌలు చివరి అపొస్తలుడు, ఆయన తరువాత అపొస్తలులు లేరు. కనుక నేడు క్రైస్తవులు సాక్ష్యమివ్వ నవసంలేదు. అయితే ఒక గొప్ప బాధ్యత వారికి ఉన్నది. అది యేసునుగూర్చి సాక్ష్యమిచ్చుట కాదు. యేసుక్రీస్తును గూర్చిన వాక్యం ప్రకటించాలి. అపొస్తలుడైన పౌలు తిమోతికి యిలా వ్రాసాడు: "వాక్యము ప్రకటించుము. సమయమందును అసమయమందును ప్రయాస పడుము. సంపూర్ణమైన దీర్ఘ శాంతముతో ఉపదేశించుచు ఖండించుము గద్దించుము బుద్ధి చెప్పుము" (2 తిమోతి 4:2). "సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి" (మార్కు 16 : 15) అని యేసు చెప్పెను. కనుక నేడు క్రైస్తవుడు సాక్ష్యమిచ్చేది ఏమి లేదు గాని వాక్యం ప్రకటించాలి. నా సాక్ష్యం వినండి అని చెప్పేవారు నాకు యిలా జరిగింది, అలా జరిగింది అని చెబుతారు. దానిని "సాక్ష్యము" అనరు "అనుభవం" అంటారు. అట్టివారి అనుభవం మనకు (క్రైస్తవులకు) అనవసరం. దేవుని వాక్యమే అవుసరం.

ఏ వాక్యంతో రక్షింపబడ్డావు ? ఏదో ఒక వాక్యం వలన దేవుడు మాట్లాడి అసాధారణ విధానంవలన రక్షిస్తాడని నేడు అనేకులు పొరబడుచున్నారు. అట్టివారే యిలాంటి ప్రశ్నలు వేస్తారు. పరిశుద్ధ గ్రంథమందు 1189 అధ్యాయములు గలవు. ప్రతి అధ్యాయంలో

అనేకమైన వచనములు గలవు. వీటిలో ఒక్క దానితో రక్షిస్తే ఆ వ్యక్తికి అదే ముఖ్యమైనది మిగతా బైబిలు గ్రంధము వారికి అవసరం లేదు అని దాని ఉద్దేశ్యమా? దేవుడు అలా ఒక్క వాక్యం చూపి దాని వలన రక్షించడు. ఆయన వాక్యం చదువుట వలన, వినుట వలన, ఆచరణ వలన, విధేయత చూపుట వలన రక్షించును. ఆయన ఆజ్ఞలు గైకొనుట వలన సంతోషించును. రక్షించుటకు శక్తిగల సువార్తకు విధేయులు కావాలి రక్షింపబడుటకు దేవుని వాక్యమునకు విధేయుడవు కావలెను. నిత్యజీవము పొందుటకు నిత్యము ఆయన వాక్యమునకు బద్ధుడవై విధేయత చూపుచు నడవాలి.

—V. J. బెన్‌సన్, హైదరాబాద్.

— o —

## సత్యారాధన

1. అణకువ కలిగి మెలకువ కలిగి
ప్రభుని నుతింపవే ఓ మనసా
సమయాసమయములను గణియించుచు
కాలహరణ గావింపకె మనసా ||

2. ఆత్మారాధన విధము నారసి
యనుసరింపవే ఓ మనసా
పాప మరణ నియమముల నుండి
నిను విడుదల జేసిన విభుని విధులు గాని ||

3. చీకటి నుండి వెలుగును జేరగ
చింత ఏలనే ఓ మనసా
మోసకరమైన నిరర్థక తత్వ
జ్ఞానముచేతను మోసపోకుమా ||

4. అలవాటులని ఆచారములని
యనుసరింపకె ఓ మనసా
మానవ కల్పిత రీతులే యవి
దేవుని వాక్కులు కావు భ్రమింపక ॥

5. క్రీస్తును చేరగ శిక్షకుడాయెను
ధర్మశాస్త్రమిక మృతము సుమా
పాతవి గతించె క్రొత్తవాయెనను
పరమార్థమునే మరువబోకుమా ॥

- S. R. కవితా, గంగవరం.

—o—

## తమ్మును తాము అప్పగించుకొనిరి !
## (They Devoted Themselves)

క్రీస్తు సంఘమునందు తమ్మును తాము అప్పగించుకొనిన వారు మనకు చాలామంది కనిపిస్తున్నారు. మత్తుమందులకు అప్పగించుకొన్నవారు లేక ఏ పాపమునైనను అభ్యసించువారు కాదు గాని, ఫొర్మునాతు, అకాయికు, స్తెఫను వంటి తమ్మును తాము అప్పగించుకొనినవారి అవసరము ఉన్నది. స్తెఫను యింటి వారిని గూర్చి అపొస్తలుడైన పౌలు యిట్లు వ్రాసెను: "స్తెఫను యింటివారు అకయయొక్క ప్రథమఫలమై యున్నారనియు, వారు పరిశుద్ధులకు పరిచర్యచేయుటకు తమ్మును తాము అప్పగించుకొనిరి" (1 కొరింథి 16:15). అప్పగించుకొనుట అనగా సమర్పించుకొనుట, లేక ఏదైన ఒక అలవాటుకు వశుడై పోవుట లేక లోబడుట అని నిర్వచింపవచ్చును. స్తెఫను యింటి వారు తమ్మును తాము పరిచర్యకు అప్పగించుకొని, తోటి పరిశుద్ధులకు వీలైనంతవరకు వారి అవసరములలో సహాయము చేసి, ఆతిథ్యము నిచ్చి, వారిని ప్రోత్సహించిరి. వారి పరిచర్యనుబట్టి పౌలు ఇటు

చెప్పుచున్నాడు : "అట్టివారికి పనిలో సహాయము చేయుచు ప్రయాస పడుచుండు వారందరికిని మీరు విధేయులైయుండుడి. స్తెఫను, ఫొర్తునాతు అకాయికు అనువారు వచ్చినందున సంతోషపడుచున్నాను. మీరు లేని కొరత వీరు నాకు తీర్చి నా ఆత్మకును, మీ ఆత్మకును సుఖము కలుగజేసిరి. గనుక అట్టివారిని సన్మానించుడి" (1 కొరింథీ 16:16-18).

## సమర్పణ జీవితం

క్రైస్తవులందరు క్రీస్తునకు అప్పగించుకొనవలెను. నమ్మకమైన పరిశుద్ధులే నిజముగా యేసునకు సమర్పించుకొనినవారు, వారి జీవితములను ఆయన వశములో ఉంచిరి; వారు వాడుకగా ప్రభువు అధీనమందుండి సేవచేయుచున్నారు. ప్రభువును ఆనందపరచుట యందు వారు లీనమైపోయిరి. క్రీస్తునకు సమర్పించుకొనుచు ఉండుట అనగా మన ధ్యానమునకు కేంద్రమై, మన ఆరాధనామూర్తిగా చేసికొనుటయే. "మేము దృశ్యమైన వాటిని చూడక అదృశ్యమైన వాటినే నిదానించి చూచుచున్నాము. ఏలయనగా దృశ్యమైనవి అనిత్యములు. అదృశ్యమైనవి నిత్యములు" (2 కొరింథీ 4:17, 18). అందువలన మనం "విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచున్నాము" (హెబ్రీ 12:2). మనము యేసునకు సమర్పించుకొనినందు వలన మన జీవితములు ఆయన అధీనమందుంచియున్నాము. ఆయనకు లోబడుటలో మనలను మనము ఉపేక్షించుకొనవలెను (మార్కు 8:34). లోకముయొక్క మూలపాఠముల విషయమై మృతినొంది (కొలస్స 2 : 20), సమాధి చేయబడి క్రీస్తులో లేపబడుము (రోమా 6:3-5). అప్పుడు పౌలుతో యిట్లుచెప్పగలవు : "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను క్రీస్తే నా యందు జీవించుచున్నాడు, నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్ప

గించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించు చున్నాను" (గలతీ 2:20).

## విధేయత

మనము యేసునకు అప్పగించుకొనుట అనగా ఆయనయొక్క చిత్తమునకు విధేయులమై అలవాటుగా సేవ చేయుట. మనము విధేయతతో ఆయన చిత్తమునకు అప్పగించుకొంటేనే తప్ప మనము ఆయనను సేవించలేము. పౌలిట్లు చెప్పెను: "లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో, అది చావు నిమిత్తముగా పాపమునకేగాని, నీతి నిమిత్తముగా విధేయతకే గాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా?" (రోమా 6:16). క్రీస్తు యెడల మన పరిచర్య ఎడతెగనిదిగాను సంశయింపరానిదిగాను ఉండవలెను. మరియు అది చల్లగానైనను, నులివెచ్చగానైనను ఉండవలదు (ప్రకటన 3:15, 16). మన దేవుని యెడలనున్న ప్రేమయే మనకు అపేక్ష పుట్టించును. " మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరకును" (2 యోహా 3:22). "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15). గనుక తప్పక మనము క్రీస్తునకు అప్పగింపబడవలెను. నిజానికి ఆయనకు అప్పగించుకొనుట అంటే ఏమిటో మనము తెలిసికొనవలెను. "మనమాయనయందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము" (అపొ. కా. 17:28).

క్రీస్తునకు తమ్మును తాము అప్పగించుకొనిన వారు ధన్యులు. ఎందువలనంటే, ఆయన మన అవుసరములను తీర్చుట మాత్రమేగాక పుష్కలమైన ఆశీర్వాదములను కుమ్మరించును. జీవించు ప్రతివానికి క్రీస్తుయొక్క అవుసరమున్నది. —టామీ హిక్స్.

—o—

## " నేను దీనిని చేసియుంటిని "

## (I have done this)

పూర్వ కాలమునుండి ప్రపంచములో గల సమస్యలను నేను చూడగా, "నేను పరలోకమునకు వెళ్ళినప్పుడు, దేవునికి అవిధేయత చూపి తినకూడని పండ్లు తినుట వలన హవ్వ ఈ లోకములోనికి తెచ్చిన తప్పిదములను నేను ఏ విధముగా అనుభవించినది ఆమెకు సరిగా తెలియచెప్పెదను" అని తలంచితిని. ఆ విధమైన నేరారోపణను చేయు చున్న అనుభవము మనందరము కలిగిన వారమే. ప్రకృతిలో పడు శ్రమలు, రోగముల వలన కలుగు బాధలు, వృద్ధాప్యమువలన వచ్చు బాధలు, మరణము వలన వచ్చు నాశనము — ఇవన్నీ మొదటి పాపము యొక్క ఫలితములు.

కాని హవ్వనుగూర్చి దయతో ఆలోచించవలెననునది నా నిజ మైనఅపేక్ష. బహుశ ఆమె చాలాకాలము జీవించియుండవచ్చు. ఎందుక నగా ఆదాము మరణించినప్పటికి అతనికి 930 స॥లు కనుక ఆమె చేసిన ఆ ఒక్క తప్పుడు నిర్ణయము వలన కలిగిన అనేక పర్యావసానములు అనేక, అనేక సంవత్సరములు ఆమెలో ప్రతిబింబించి యుండవచ్చు. క్షేమకరమైన ఆశ్రయమగు ఏదేను వనమునుండి వెళ్ళగొట్టబడినపుడు, ఖడ్గజ్వాలలు గల దేవదూతలు వారి మార్గములో అడ్డుకొన్నపుడు ఆదాము చేతిలో చేయవేసి నిలబడి హవ్వ ఏ విధముగా బాధపడి యుండునో ఒకసారి ఆలోచింతము. అడవులు, పొలములు ముండ్ల తుప్పలతోను, గచ్చ పొదలతోను ఆవరింపబడి వాటినే ఉత్పత్తి చేయుచున్నపుడు హవ్వ తన హృదయమందు ఏడ్చుచు "నేను భూమికి దీనిని చేసియుంటిని" అని తలంచవచ్చు.

క్రూరమైనవిగా, అపాయకరమైనవిగా మారిన జంతువులనుండి

భయముతో వారు పారిపోవునపుడు "నేను దీనిని చేసితిని" అని హవ్వ గుర్తించి యుండవచ్చు. పాపమువలన అర్పణలు అవసరమైనవి. ఆదాము అమాయకమైన, విశాలమైన కన్నులు గల గొర్రెయొక్క ప్రాణమును తీయుటకు తన కత్తి నెత్తినపుడు అతడు పడిన బాధను, విచారమును ఆమె చూచెను. ఆ గొర్రెయొక్క కంఠమునుండి ప్రవహించుచున్న ఎర్రని రక్తమువలె ఆమె కన్నీళ్లు ఎంత వెచ్చగా యుండియుండునో కదా! "నేను దీనిని చేసితిని" అని ఎంతగానో విలపించి యుండియుండును కదా!

ఆదాము మొట్టమొదటి సారిగా రోగముతో యున్నపుడు, ఆమె హృదయమందు భయముతో ఆందోళన చెందుచూ అతని బాధను గమనించి యుండియుండును. ఆమె దినదినము అతని మంచము ప్రక్కనే యుండి కనిపెట్టుచు అతడు అనారోగ్యము నుండి విడుదల కావాలని, తిరిగి శక్తిని చేకూర్చమని ప్రార్థించుచు, కన్నీరు విడుచుచూ, మిక్కిలి దుఃఖించుచు "నా ప్రియమైన ఆదామునకు నేను దీనిని చేసితిని" అని మిక్కిలి వ్యసనపడి యుండును.

కయీను, హేబెలులు పుట్టి, వారు పెద్దవారైనప్పుడు, అతని సహోదరునిపై కయీనుయొక్క ఈర్ష్యను ఆమె గమనించినపుడు ఆమె యొక్క విచారము కొనసాగుచునే యుండెడిది. ద్వేషముతో కూడిన ప్రతీ మాట ఆమె హృదయమును కోతకు గురిచేయగా "నేను దీనిని చేసితిని" అని గుర్తించినది.

హేబెలు తన స్వంత అన్నచే చంపబడి పొలములో పడి యున్నపుడు, రక్తముతో తడిసిన అతని తలను మిక్కిలి వేదనతో ఊయలూగించి యుండెనేమో! ఎంతో కృంగిన హృదయముతో దేవునివైపుకు తిరిగి "నేను దీనిని చేసితిని! నేను లోకములోనికి పాపమును తెచ్చితిని. నేను ప్రేమించిన ఈ కుమారునికి మొదట చావు

ప్రార్థించినది - నాకు కాదు, సాతానుమాట వినిన నాకు కాదు! దీనిని నేను చేసితిని". నేను "దీనిని చేసితిని" అని విలపించియుండి యుండును. భయముతో వారు పారిపోవునపుడు "నేను దీనిని చేసితిని" అని హవ్వ గుర్తించి యుండవచ్చు.

నేను హవ్వను చూచునపుడు శాపగ్రస్తమైన మాట ఒక్కటి కూడ పలుకలేను, కొన్ని వందల సంవత్సరములనుండి, ఆమె పాపము వలన గల్గిన నాశనములను చూస్తూ దినదినము తన్ను తాను శపించు కొని యుండి యుండును.

ఒకవేళ హవ్వ అవిధేయత చూపకపోయినట్లయిన వేరొకరు ఆ విధముగా చేయుటద్వారా ఈ లోకములోనికి పాపమును దాని యొక్క పర్యవసానములు వరదవలె ప్రవేశించుటకు ద్వారము తెరువబడియుండును. కొందరు అబద్ధముగా బోధించునట్లుగాక, ఆదిమ పాపముయొక్క అపరాధమును మనము కలిగియుండము కాని వ్యక్తి గతముగా దినదినము చేసిన పాపమును అనుభవింతుము. మన జీవి తములో చేసిన ఆ పాపముల పర్యవసానములు, హవ్వ అనుభవించిన రీతిగా తుదకు మనలను నడిపించును.

అవును, సంవత్సరముల తరబడి సంవత్సరములు మన పాపము వలన లేక మన తప్పు నిర్ణయములవలన కలిగిన పర్యవసానములతో మనము నివసించుచున్నాము. మనము నమ్మకస్తులము అయితే మన యొక్క సమస్యలకొరకు లేక మన పిల్లల జీవితములలోగల సమస్యల కొరకు ఎన్నిసార్లు దేవుని యెదుట ఒప్పుకొని, దుఃఖించి యుండలేదు. "నేను దీనిని చేసితిని ఎందుకనగా దేవా నీ మార్గమును వెదుకలేదు! అన్నింటికంటే ఎక్కువగా దేవుని ప్రేమించాలి అని నా పిల్లలకు బోధించలేదు. నేను తప్పుడు నిర్ణయములను తీసికొంటిని కనుక ఈ సమస్యలన్ని అభివృద్ధి చెందినవి-నేను దీనిని చేసితిని" అని ఎన్నిసార్లు మనం విలపించలేదు?

మనము హవ్వను చూచినప్పుడు ఆ రోజు ఆమె వేరుగా ప్రవర్తించి యుండవలసినదని తలంతుము. తద్వారా ఆమెయు, మానవ కోటి అంతయు ఇప్పుడు చెల్లించుచున్న భయంకర మూల్యమునుండి తప్పింపబడి యుండును. అయితే మన జీవితములను మనమే ఒకసారి స్పష్టముగా పరిశీలించి ఇప్పుడే చూచుకొనుట మంచిది.

—బెట్టీ ఫోట్.

— o —

## యుద్ధము మొదలిడింది!

## (The War is on)

—జె.సి. బెయిలీ.

నా జీవితములో మొదటి ప్రసంగాన్ని 1921వ సంవత్సరం జూన్ నెలలో చేసాను. ఆ రోజు 1 తిమోతి 6 : 12 ను నా పాఠ్య భాగంగా ఎంచుకొన్నాను : "విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము, నిత్యజీవము చేపట్టుము. దాని పొందుటకు నీవు పిలువ బడి అనేక సాక్షుల యెదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకొంటివి" అని అక్కడ చెప్పబడినది. 2 కొరింథీ 10:3-4లో యేమి వ్రాయబడిందో దానిని మనము ఎల్ల వేళల జ్ఞాపకముంచుకొనాలి : "మేము శరీరధారులమై నడుచుకొన్నను శరీర ప్రకారము యుద్ధము చేయము. మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావు గాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలముకలవై యున్నవి". "ఈ మంచి పోరాటము పోరాడవలెనని" తిమోతిని పౌలు ఆజ్ఞాపించి యున్నాడు (1 తిమో 1:18).

1995 సెప్టెంబరు నాటికి నాకు 92 సంవత్సరములు పూర్తి అవుతాయి, నిజమే. "కాగా నా ప్రియులారా, మీరెల్లప్పుడు విధేయులై యున్న ప్రకారము, నా యెదుట ఉన్నపుడు మాత్రమే గాక మరి యెక్కువగా నేను మీతో లేని యీ కాలమందును భయముతోను,

వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి" యని పౌలు వలె మీకును హెచ్చరిక చేయుచున్నాను (ఫిలిప్పీ 2:12). సంఘము ద్వారా దేవునియొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియజేయ బడవలెనని దేవుడు సంకల్పించియున్నాడు (ఎఫెసీ 3:10-11).

మన విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు 2 తిమోతి 4:7-8లో పౌలు చెప్పిన మాటలను మనమును చెప్పగలిగి యుండాలి: "మంచి పోరాటము పోరాడి తిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నాకొరకు నీతికిరీటముంచబడి యున్నది. ఆ దినమందు నీతి గల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించువారి కందరికిని అనుగ్రహిం చును". ఆ బహుమతిని పొందుటకు చేయగలిగినదంతా చేసేసానని తలంచుచు మనము ఎన్నడు ఉపేక్ష కలిగియుండరాదు. "ఇదివరకే నేను గెలిచితినని యైనను, ఇదివరకే సంపూర్ణసిద్ధి పొందితినని యైనను నేను అనుకొనుటకు లేదు, గాని నేను దేని నిమిత్తము క్రీస్తు యేసు చేత పట్టుబడితినో దానిని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాను. సహో దరులారా, నేనిదివరకే పట్టుకొని యున్నానని తలంచుకొనను. అయితే ఒకటి చేయుచున్నాను, వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తు యేసునందు దేవుని ఉన్నత పిలుపు నకు కలుగు బహుమానమును పొందవలెనని గురియొద్దకే పరుగెత్తు చున్నాను" (ఫిలిప్పీ 3:12-14). గతంలో గొప్ప యుద్ధములు చేయ బడ్డాయి. విజయాలు సాధించబడ్డాయి. అయితే ఈ యుద్ధము మాత్రం ఇంకా ముగియలేదు. క్రీస్తు యోధులారా యుద్ధమాడుడి, క్రీస్తు సిలువపట్టి గెలవుడి.

నేను వెడలిపోకముందు ఇండియాకు ఇంకొకమారు రావాలని

కాంక్షించుచున్నాను. ఆ నిష్క్రమణ 2 తిమో 4:6, 7లో యున్నది: "నేనిప్పుడే పానార్పణముగ పోయబడుచున్నాను, నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది. మంచిపోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని" అని తప్పక చెప్పగలను!

— • —

## సంక్షిప్త వార్తలు

*1995* ఏప్రియల్ నెల 27, 28, 29, 30 తేదీలలో నిజామాబాద్ మహా పట్టణంలో అక్కడి స్థానిక క్రీస్తు సంఘము గొప్ప సువార్త కూటములు నిర్వహించిరి. ప్రతి దినము రెండు కూటములు జరిగాయి. ప్రతి కూటమునకు ఇంచుమించు 400 మంది హాజరయ్యేవారు. ఈ సువార్త కూటములలో సోదరులు పాల్ గూటం, యన్. ఏలియా, జాషువా గూటంగారు వాక్యపరచర్య చేసిరి. కూటముల ఆఖరి రోజున ఏడుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

నిజామాబాద్ పట్టణంలోను, కరీమ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల లోను సోదరులు **N.** టైటస్‌గారు నిర్విరామ కృషి చేయుచు క్రీస్తు కొరకు గొప్ప పనిని చేయుచు బలమైన సంఘములను స్థాపించుచున్నారు. నిజామాబాద్, డిచ్‌పల్లి, ధర్మోర గ్రామములలో చక్కటి పర్మనెంటు చర్చి బిల్డింగ్‌లు కూడ నిర్మించబడి యున్నవి. మరియు టైటస్‌గారి పరిచర్యవలన యితర గ్రామములలోను కూడ చర్చి బిల్డింగ్‌లు నిర్మించబడే అవకాశమున్నది. ఏప్రియల్‌లో జరిగిన సువార్త కూటములలో నిజామాబాద్ స్థానిక సంఘ మంతయు చక్కటి బాధ్యత వహించి కూటములను జయప్రదము గావించిరి. **Bro.** రవిబాబుగారి సతీమణి యొక్క ఆధ్వర్యములో సంఘములో గల యౌవన బాల బాలికలు చక్కటి కీర్తనలు పాడుచు సభ అంతయు

దేవుని స్తుతించునట్లు నడిపించిరి. నిజామాబాద్ జిల్లాలో దేవుని పని మరింత బలపడునట్లు ప్రార్థింతము.

* * * *

1995 మే నెల 18వ తేదీ రాత్రి పెద్దాపురం వాస్తవ్యులును, క్రీస్తు యోధులునైన Bro. T. జాన్ S. ఫ్రెడరిక్ గారు ప్రభువునందు నిద్రించిరి. 26వ తేదీ సాయంత్రం పెద్దాపురంలోని తమ స్వగృహమందు స్మారక కూటము జరిగెను. ఆయన విడిచి వెళ్ళిన కుటుంబము కొరకు, పనికొరకు ప్రార్థించుదము. ఆయన కుమారుడు T.Ch. ఫ్లెమింగ్స్‌గారు పెద్దాపురం ప్రాంతములో సువార్త పనిని సమర్థవంతముగ నిర్వహించుచున్నారు.

* * * *

మే నెల సువార్తికుల సదస్సు తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట మండలంలో గల పూజారిపాలెం గ్రామములో 22వ తేదీ సోమవారంనాడు నిర్వహించబడెను. ఆ రోజు అనేక మంది స్థానికులే గాకుండా, వివిధ ప్రాంతముల నుండి వచ్చిన 75 గురు సువార్తికులు కూడ హాజరై, "బైబిలు దేవుని వాక్యమై యున్నది-ఎట్లు?" అను అంశాన్ని విశదముగా చర్చించిరి. ఈ సదస్సుకు సోదరులు P.J. కృపాలిసీగారు అధ్యక్షత వహించి ఆదినుండి అంతమువరకు సక్రమముగాను, మర్యాదకరముగాను నిర్వహించిరి. సోదరులు N.J. మోహన్ రావ్, డి. ఇశ్రాయేలు రాజు, ఎ. దాసు, M.L. క్రిష్టొఫర్, బి. యోహాను, పి. హెన్రీ, N. ఏలియాగార్లు ఉదయకాలపు సమావేశములో చర్చలో పాల్గొనగా, సోదరులు బి. ప్రసాదరావ్, వెంకటరావ్, R సామ్యూల్, Ch. జాన్‌బాబ్, మరియు పాల్ గూటంగారు మధ్యాహ్న కాలపు సమావేశములో పాల్గొని వాక్యపరిచర్య చేసిరి.

ఈ లోకంలో ఉన్న గ్రంథాలకన్నా పాతది బైబిలు. దానిని వ్రాయుటకు 1600 సంవత్సరములు, 39 మంది లేఖకులు అవుసరమైనది. దానిలో గొప్ప ఏకీభావము కలదు. స్వవిరుద్ధ సంగతులు యేమియు లేవు. అందులో నేడు కూడ మార్పు చేయవలసినవి, సరిదిద్దవలసినవి యేమియు లేవు. ఏలయనగా దాని అసలైన గ్రంథకర్త మానవుడు

కాదుగాని దేవుడే. బైబిలులో పాండిత్యం సంపాదించిన వాడెవడును లేడు. దాన్ని ఎంత నేర్చుకొనినా, నేర్చుకోవలసినది ఎంతో దానిలో యున్నది. ఎన్నిసార్లు చదివినా అది క్రొత్తగానే యుండును. ఏలయనగా అందులో వున్నది దేవుని మేధస్సు, దేవుని జ్ఞానము. అది విజ్ఞాన శాస్త్ర ప్రకారము యథార్థము, చారిత్రికంగా సత్యము, భౌగోళికంగా వాస్తవము. మానవుడు దానిని నాశనం చేయాలన్నా అది నాశనం కాదు. బైబిలు ప్రబలియున్న చోట మానవులు స్వేచ్ఛ, సహోదరభావములు కలిగి జీవిస్తారు. అది లేనిచోట పశువుల వలె ప్రవర్తిస్తారు. మానవులను పాపమునుండి రక్షించు శక్తి దానిలో యున్నది. అది దేవుని వాక్యము కాకపోతే ఇంకేమిటి?

పూజారిపాలెంలోని క్రీస్తు సంఘము దూరమునుండి వచ్చిన వారికి భోజన, పాన సదుపాయములు చక్కగా కల్పించుటలో సోదరులు వి. హిట్లర్ గారు చక్కని పని చేసిరి. సోదరులు ఎస్. ఏలీయాగారి ప్రార్థనతో ఆ రోజు సదస్సు జయకరముగా ముగిసెను. జూన్ నెల సువార్తికుల సదస్సు లక్ష్మీపోలవరంలో నిర్వహించబడును.

---

Regd. No. R/KD—45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
..............................
..............................
..............................
..............................